# నశ్యమాహాత్మ్యం

శ్రీ ఎం. బి. జోసఫ్

నేనప్పుడు స్కూల్ ఫైనల్ క్లాస్ చదువుతోన్న. దాబడం కాదుగానండీ, చదువులో కొంచెంపుట్టివాణ్ణె. తప్పకుండా పాస్ అయ్యేవాళ్ళలో ఒకణ్ణి గూడాను. "కష్టే" అన్నారు గనక. దీనికి తోడు కష్టపడి చదివి Eligibility తెచ్చుకుంటే, మంచి పేరు ప్రతిష్టలు వస్తాయని. హాస్టలు వొదిలేసి వేరేగా వుంటే చదువు బాగా సాగుతోందని, లాలాపేటలో ఓ రూం అద్దెకు తీసికున్నా. నా ప్రక్క రూంలో యింకో కుర్రాడున్నాడు నాక్లాస్ వాడే. శాస్త్రికి నాకు మంచి పరిచయం ఏర్పడింది. Comblne study చేయడం మొదలెట్టాం.

ఓరాత్రి యిద్దరం హరికేన్లాంతరుదగ్గర కూచుని, నెమ్మదిగా పుస్తకాలవేపు చూస్తోన్నాం. గదంతా నిశ్శబ్దంగా వుంది. నేను తలవంచుకొని చదువుతోన్నా. ఇంతలో ముక్కుల్లో కేదో పీల్చినట్టు శబ్దం వినిపించింది నాకు. పైకిజూచా. అప్పుడే తిరిగి జేబులో పెడుతోన్నాడు పొడుంకాయ శాస్త్రి. "పొడుం అలవాటుందా" అన్నాను నెమ్మదిగా. "ఆ, ఏదో అయిందిలెండి, మీరుగూడా ఓ చిటికె చూస్తారా" అంటూ, నాకందించాడు ఆ పొడుంకాయ. "లాభమేమిటి దీన్ని పీల్చడంలో" అన్నాను.

"చదువుకునే కుర్రాళ్ళు నిద్రగాచి బాగాచదువుకోడానికి మంచి ఉపాయం అని చెబితే, అలవాటుపడ్డాను" అన్నాడు. సరే, నేను కొంచెం కష్టపడే చదవాలని తలంచాను గనక, దీని శక్తేలా ఉంటుందో చూద్దామని పీల్చేనో చిటికె భయంతో.

సరే. అయింది.

అమాసం రోజుల్లో అప్పుడపుడు తగుల్తూనే వొచ్చా. పరీక్షలయ్యాయి. శెలవులకొచ్చాం యిండ్లకు.

మా నాన్నగారికి ముప్పై ఏండ్లపైగానున్నఅలవాటిది. పరీక్షల సమయంలో వేసినదానిమీద శెలవుల్లో అప్పుడపుడు ఆయన కగపడకుండా చూస్తునేవున్నా. ఓసారి మాఅమ్మ జూచి "ఆవు చేలోమేస్తే దూడగట్టున మేస్తోంది" అన్నది మా నాన్నతో. "ఏమిటన్నాడు" కంగారుతో. "ఆ ఏముంది. కొడుకు పొడుం వేస్తున్నాడుగ" అంది మూతి విరుస్తూను. "అబ్బాయి, తప్పురా. కండ్లకు జబ్బు వస్తుంది. మెదడుకు దెబ్బ. ఏదో, మేమంటే పూర్వకాలపు వాళ్ళం గనక చెల్లిపోయింది. నీవుమట్టుకు దాన్నిముట్టవొద్దని" శాసించినట్టుగా బ్రతిమాలినట్టుగా అనేవాడు.

"అలవాటైన చేయి, అమావాస్య కల్లల్లాడుతోందని" ఆయన అంతగా చెప్పినా ఎప్పుడోఒకమాటు చూస్తునే వున్నా వేసవిశెలవుల్లో. "పడ్డకష్టం ఫలితానికి రాకపోతుందీ" అన్నట్లు పదోక్లాస్ నెగ్గానని గెజట్‌లో అచ్చుఅయింది. మావాళ్ళంతా ఆనందించి, ఇంటర్‌కు పంపాలంటే పంపాలని, గుంటూరుపంపారు కాలేజిలో జేరమని.

అక్కడ హాస్టల్లో ఓ పెద్దరూంలో సీటిచ్చారు నాకు. ఇంకా ముగ్గురు కుర్రాళ్ళు గూడాఉన్నారారూంలో. ఎప్పుడుచూచినా వాళ్ళ మూడుబల్లలమీద మూడుపొడుంకాయలుంటూనే ఉన్నాయి. "ఛీ, యీపాడలవాటు వదలాల"ని అనుకునేవాణ్ణి మనస్సులో. తీరావ్యవహారం జరగబొయ్యేసరికి ఖాళీ! తప్పని సరి చిటికె తీయవలసిందే! ఈలా వారంరోజులు వాళ్ళదేవాడా. అలవాటైంది. ప్రతిరోజూ వాళ్ళనాశ్రయించడందేనికి కానీభాగ్యానికని, నేనోకాణీ పొడుంతేవడంఅయింది. పొరబాటైంది. తర్వాత గ్రహపాటైంది. ఆఖరుకలవాటైంది!

అబ్బ! దీనిమహత్తేమిటో గానండీ. అది లేకపోతే ముక్కురంధ్రాలు యినుపతలుపులువేసి బిగించినట్టుండేవి. ఊపిరి సలపక యిహ నోటితో శ్వాస పీల్చడం అవుతోంది. చాలా ఘోరంలెండి!

చెబితే నచ్చచెప్పలేంగానండి వేసేవాళ్ళకి దీని మహత్తు బాగా అర్థమవుతోంది. ఇది ముమ్మాటికినమ్మండి. అనుభవం కావాలంటే, అలవాటుచేసి చూడండి. అప్పుడు మీకే తెలుస్తోంది దాని మహత్తు. "A trial will convince you" అన్నట్టు ఆలా ఓ ఏడాదిలో రోజుకు రెండుకాన్లు చెల్లుతోన్నాయి పొడుం క్రింద.

ఓరాత్రి నేను నా స్నేహితుడూ కలసి సినిమా కెళ్లాం రెండో ఆటకి. రూంకొచ్చాక పడుకోబోతూ చూచాను పొడుంకాయ. ఖాళీగావుంది. "పొడుం తెచ్చుకొనేందుకు బజారుకివెళ్ళొద్దాం రారా" అన్నాను గోపితో. "పోరా! అర్ధరాత్రివేళ నీకు పొడుంవేసేవెధవ ఎవడు? నాకు నిద్రవస్తోంది" అని కండ్లుమూసి బిగుసుకొన్నాడు శాలువాలో. నాకు తప్పిందిగాదు. లేచి మెల్లగా మామూలుగా పొడుంతెచ్చే కొట్టుకెళ్ళా. దారిలో ఒంటిగంటవేళారు.

'ఏమండోయ్.'

— — —

— — —

— — —

'ఏమండోయ్' అని యీసారి బిగ్గరగా అన్నాను.

కుంభకర్ణుణ్ణి మరపిస్తోంది అ లోపలనుంచి నాకు వినబడుతోన్న ఆగుర్రు. నాకు భయంవేసిందాతన్ని లేపడానికి. ఏలాగైనా తప్పేట్టులేదు.

'ఏమండోయ్, కొంచెం పొడుమండీ' అన్నా కొంచెం దీన స్వరంతో.

'ఎవర్రా?'

'పొడుమండీ'

ఛీ! పశువా! అర్ధరాత్రిలో పొడుమేమిటి. మూర్ఖుడా! వెళ్ళు. నిద్ర నష్టమౌతోంది' అన్నాడాయన. ఖిన్నుణ్ణయ్యాను.

ఇంతలో ముక్కులు బిగేశాయ్. స్వరంగూడా తగ్గుతోంది. నోటితో శ్వాస. నాస్థితి భయంకరంగా వుంది.

"ప్రాణంకన్నా, మానం మేలనివున్నా. పొడుం చిటికె దగ్గర మానం కాయడానికి ప్రాణం పోగొట్టుకొంటే, తర్వాత యీ సంగతి విన్నాళ్ళంతా 'పశుప్రాయుడు' యీలాంటి మానాన్నా కాపాడుకొంటూ, ప్రాణం పోగొట్టుకోమన్నది. తెలివితక్కువ దద్దమ్మ" అంటారని, ఎమైనా సరే. ఏమైనా సరే, వదలగూడదనుకొని పట్టాను భల్లూక పట్టు.

'అయ్యా! ముక్కులు బిగేశాయ్. తమరులేచి నా ప్రాణం రక్షించాలి.'

'ఛీ! భడవ, ప్రాణం రక్షిస్తానో, తీయిస్తానో చూడు. ఎంత నిద్ర. ఎంత నిద్ర నీపొట్టన బెట్టానంటూ" పొడుంబండ భుజాన వేసినకొని తలుపుతెరచాడు.

పొడుంలేక నాప్రాణాలు పొయ్యేటప్పుడు వాటిని తీసికెళ్ళడానికొస్తోన్నా యముడిలా కనుపించాడునాకాయ. ఏంచెయ్యను. ఆ బండతో చావమోది ఓ చిటికెడు పొడుంవేసినా దాంతో పొయ్యే ప్రాణాన్ని లాక్కోగలనని నా కమితనమ్మకమున్నామూలాన, అలానే "దూడకు పాతినమేకు చందాన" నిలబడే వున్నా.

"ఏంరా! సైతాన్‌కె—బేటా! పోవూ".

"పిల్లేదండీ!"

"ఏం చస్తావా?"

"తమకి తెలియందేముంది. తమరూ దీన్ని సేవిస్తారుగా. నన్ను గుర్తించలా?"

"ఎవరోయ్."

'నేను ఫలానాండి."

'నీవా! ఎందుకింత రామాయణం? మొదటనే అలా అనకూడదు" అంటూ 'ఎంతటిద'న్నాడు

'అది తర్వాత సంగతి. ముందోచిటికివ్వండి ప్రాణం రక్షించుకోడానికన్నా.

'దీని వ్యహారమంతా యింతే. పాడు పీడా పాపం' తీసికో అంటూ అందించ్చాడు గంపెతో. ఆ చిటికె తీసికొనేప్పుడు నాలో ఏలా వుందో చెప్పలేను- మూడునాల్గు రోజులనుంచి అన్నంలేక అల్లల్లాడుతూ. ఎవర్నడిగినా ఛీ! కొడుతూండే సమయంలో. ఏ ధర్మాత్ముడో పిల్చి పిడికెడన్నం పెడితే నోట్లో వేసుకోబొయ్యేటప్పుడెలా వుంటుందో ఆ ప్రాణికి. నాకాలా వుంది. "Thanks" అంటూ ఒక్కమారె చిటికెతో పొయ్యే ప్రాణాన్నిలాక్కొన్నా సంజీవి తుల్యమైన ఆ పొడుం చిటికెతో.

తర్వాత ఓ కాణీదివేయించుకొని ఆతని ఔదార్యాన్ని శ్లాఘిస్తూ, రూంకొచ్చి పడుకున్నా. నాకు తెలియకండానే నిద్ర పట్టింది.

